


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM



## ఏపీలో ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

ఏపీలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,559 కేంద్రాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. నేటి నుంచి 20వ తేదీ వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 5,29,457 మంది ప్రథమ, 4,76,198 మంది ద్వితీయ సంవత్సరం ఎగ్జామ్స్‌కి హాజరు కానున్నారు.

బంగారం ధర ₹63,440 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,800

సెన్సెక్స్ 71,790 (38)

నిఫ్టి 21,734 (8)

చికెన్ ధర 1KG ₹ 260

గుడ్ల ధరలు డజన్ ₹68

# ఆపరేషన్ వాలెంటైన్ మూవి రివ్యూ

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మానుషీ చిల్లర్ హీరోయిన్ గా నటించిన లేటెస్ట్ చిత్రం "ఆపరేషన్ వాలెంటైన్". కాగా ఈ చిత్రం ఈ రోజే విడుదల అయింది. మరి ప్రేక్షకులును ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం!


కథ: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో అర్జున్ రుద్ర (వరుణ్ తేజ్) వింగ్ కమాండర్. అర్జున్ దేశ రక్షణ కోసం రెడీ అయ్యి వచ్చే ఎయిర్ క్రాఫ్ట్స్ ని టెస్ట్ చేసే విభాగంలో పని చేస్తుంటాడు. స్వతహాగా ఆవేశపరుడైన రుద్ర 'ఆపరేషన్ వజ్రా'లో ఫెయిల్ అవుతాడు. ఆ తర్వాత జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో పుల్వామా దాడి జరుగుతుంది. 40 మందికి పైగా సైనికులను ఇండియా కోల్పోతుంది. దానికి ప్రతీకారంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చేసిన పోరాటం ఏమిటి ?, వింగ్ కమాండర్ అర్జున్ రుద్ర పడ్డ కష్టం ఏమిటి ?, ఈ మొత్తం యుద్ధంలో రుద్ర భార్య అయిన మరో కమాండర్ అహ్నా ( మానుషి చిల్లర్) పాత్ర ఏమిటి ? అనేది మిగిలిన కథ.

ప్లస్ పాయింట్స్: ఈ 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో రూపొందటమే ఈ సినిమాకు ప్రధాన బలం. అలాగే దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ హడా ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో రాసుకున్న సన్నివేశాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పైగా తెలుగులో ఎయిర్ ఫోర్స్ బ్యాక్ డ్రాప్ లో ఎక్కువ సినిమాలు రాకపోవడంతో ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు తెలుగు ప్రేక్షకులకు ఒక సరి కొత్త అనుభూతినిస్తుంది. ఇక రుద్ర పాత్రలో వరుణ్ తేజ్ చాలా చక్కగా నటించాడు. కొన్ని స్పేస్ సన్నివేశాల్లో తన రియలిస్టిక్ యాక్టింగ్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లో సాగే కొన్ని ఎమోషనల్ సన్నివేశాల్లో కూడా తన నటన బాగుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన మానుషీ చిల్లర్ కూడా తన నటనతో ఆకట్టుకుంది. కొన్ని భావోద్వేగ సన్నివేశాల్లో తన పెర్ఫార్మెన్స్ తో ఆమె మెప్పించింది. మరో కీలక పాత్రలో నటించిన మిర్ సావర్ కూడా ఆకట్టుకున్నాడు. నవదీప్ తో పాటు మిగిలిన ప్రధాన పాత్రధారులు కూడా తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు.

మైనస్ పాయింట్స్: పుల్వామా దాడికి ప్రతీకారంగా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చేసిన పోరాటం ఎలా సాగింది ?, అలాగే ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలోని సన్ని వేశాలు బాగానే ఉన్నా.. దర్శకుడు కథనాన్ని మాత్రం పూర్తి ఆసక్తికరంగా మలచలేకపోయారు. కీలకమైన సన్నివేశాలను బాగా రాసుకున్నప్పటికీ.. మిగిలిన సన్నివేశాల్లో కొన్నిటిని మాత్రం ఆసక్తికరంగా మలచలేకపోయారు.సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుంది ?, హీరో అండ్ టీమ్ ఎలాంటి కష్టాల్లో పడతారో, వాళ్ళు అనుకున్నది ఎలా సాధిస్తారో అనే ఉత్కంఠ ప్రేక్షకుల్లో ఇంకా పెంచే అవకాశం ఉన్నప్పటికీ, దర్శకుడు మాత్రం ఆ దిశగా సినిమాని నడపలేదు. ఇక సినిమా ఫస్టాఫ్ కథనం కూడా సాదా సీదాగానే గడిచిపోయింది. దీనికి తోడు సినిమాలో కొన్ని చోట్ల మరీ సినిమాటిక్ గా అనిపిస్తోంది.

సాంకేతిక విభాగం: మంచి కథా నేపథ్యాన్ని తీసుకోవడంలో సక్సెస్ అయిన దర్శకుడు శక్తి ప్రతాప్ సింగ్ హడా ఉత్కంఠభరితమైన కథనాన్ని రాసుకోవడంలో మాత్రం కాస్త వెనుకబడ్డారు. కానీ, స్పేస్ నేపథ్యంలో ఆయన రూపొందించిన సన్నివేశాలు, విఎఫ్ఎక్స్ వర్క్ ను వాడుకున్న విధానం ఆకట్టుకున్నాయి. సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం బాగుంది. హరి కె. వేదాంతం సినిమాటోగ్రఫీ వర్క్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నిర్మాతలు సందీప్ ముద్దా, సోనీ పిక్చర్స్ నిర్మాణ విలువలు కూడా చాలా బాగున్నాయి.

తీర్పు: ఎయిర్ ఫోర్స్' నేపథ్యంలో స్పేస్ యాక్షన్ థ్రిల్లర్ గా వచ్చిన ఈ చిత్రం కొన్నిచోట్ల ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. కథలోని మెయిన్ పాయింట్ మరియు ఫ్లైట్ ల మధ్య సాగే యాక్షన్ సన్నివేశాలు, ఎమోషన్స్ అలాగే విఎఫ్ఎక్స్ వర్క్ సినిమాలో ఆకట్టుకున్నాయి. కానీ, నెమ్మదిగా సాగిన కథనం, లాజిక్ లేని కొన్ని కీలక సన్నివేశాలు వంటి అంశాలు సినిమాకి బలహీనతలుగా నిలుస్తాయి. ఓవరాల్ గా భిన్నమైన యాక్షన్ చిత్రాలను ఇష్టపడేవారికి ఈ సినిమా నచ్చుతుంది.






## రూ.25 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర

ధరల మోతతో ఇబ్బంది పడుతున్న గ్యాస్ వినియోగదారులకు దేశీయ చమురు సంస్థలు మరోసారి షాక్ ఇచ్చాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధరను పెంచాయి. 19 కేజీల సిలిండర్‌పై రూ.25.50 పెరిగింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారం ప్రకటించాయి. పెరిగిన ధరలు నేటి నుంచి అంటే మార్చి 1 నుంచే అమల్లోకి రానున్నట్లు వెల్లడించాయి. ధరల పెంపు తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,795కు చేరింది. ముంబైలో ఇది రూ. 1,749కి చేరగా.. కోల్‌కతాలో రూ. 1,911, చెన్నైలో రూ.1,960.50 గా ఉంది. ఇక హైదరాబాద్ మహానగరంలో 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర గరిష్ట స్థాయిలో రూ. 2,027 వద్ద ఉండటం గమనార్హం. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలను బట్టి ధరల్లో మార్పులు ఉంటాయి. అయితే గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని చమురు కంపెనీలు వెల్లడించాయి. మరోవైపు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరల్ని పెంచిన క్రమంలో విమానయాన ఇంధన ధరలను కూడా ఆయిల్ కంపెనీలు పెంచాయి.



## లాస్య నందిత కేసులో కీలక మలుపు.. టిప్పర్‌ను సీజ్ చేసిన పోలీసులు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదంలో టిప్పర్‌ను ఢీకొట్టడంతోనే లాస్య నందిత మృతిచెందారని గుర్తించారు. కారును ఢీకొన్న టిప్పర్‌ను పటాన్‌చెరు పోలీసులు గుర్తించారు. టిప్పర్‌ను సీజ్‌చేసిన పోలీసులు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు. గతనెల 23న పటాన్‌చెరు పరిధిలోని ఎల్లంకి ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలోని ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య నందిత మరణించారు. ఆమె ప్రయాణిస్తున్న కారు.. గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొని అదుపు తప్పి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. దీంతో వాహనం ముందువైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న నందిత ఘటనా స్థలంలోనే మృతిచెందిన విషయం తెలిసిందే.



## మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటు కొలిక్కి.. కాంగ్రెస్‌కు 18 స్థానాలు

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మహారాష్ట్రలో ప్రతిపక్షాల కూటమి మహా వికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు అంశం కొలిక్కి వచ్చింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలకుగానూ ఉద్ధవ్ ఠాక్రే శివసేన 20 స్థానాల్లో పోటీ చేయనుంది. కాంగ్రెస్ 18, శరద్‌పవార్ ఎన్సీపీ 10 చోట్ల అభ్యర్థులను బరిలో దించనుందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనిపై అధికారికంగా కొద్ది గంటల్లో ప్రకటన వెలువడనుంది. ఈ మూడు ప్రధాన విపక్ష పార్టీల మధ్య సీట్ల పంపిణీపై కొద్దిరోజులుగా చర్చలు జరుగుతున్నాయి. 8 సీట్ల విషయంలో నెలకొన్న అనిశ్చితి ఇప్పుడు తొలగిపోయిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ముంబయిలోని ఆరు లోక్‌సభ స్థానాల్లో నాలుగు చోట్ల శివసేన(యూబీటీ) పోటీ పడనుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. ఎంవీఏ మిత్రపక్షమైన వంచిత్ బహుజన్ అఘాడీ రెండు స్థానాల్లో బరిలో నిలవనుంది. ఆ సీట్లు ఠాక్రే పార్టీ వాటా నుంచి వెళ్లనున్నాయి. పవార్ పార్టీ తనకు దక్కిన 10 స్థానాల్లో ఒకదాన్ని స్వతంత్ర అభ్యర్థితో పంచుకోనుందని సమాచారం.

## లాభాల్లో స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాల మధ్య దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:36 గంటల సమయంలో సెన్సెక్స్ 421 పాయింట్ల లాభంతో 72,922 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 146 పాయింట్లు పుంజుకొని 22,128 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.82.86 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టాటా స్టీల్, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, ఎస్‌బీఐ, మారుతీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, విప్రో, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో భారత జీడీపీ 8.4% వృద్ధి చెందింది. మన దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్య 13% తగ్గి 32 బి.డాలర్ల (సుమారు రూ.2,65,000 కోట్ల)కు పరిమితమైనట్లు ప్రభుత్వ తాజా గణాంకాలు వెల్లడించాయి.






## ఓటిటిలోకి వచ్చేసిన ఈగిల్

మాస్ మహారాజ రవితేజ లేటెస్ట్ యాక్షన్ స్టైలిష్ మాస్ ఎంటర్టైనర్ మూవీ ఈగిల్. ఈ మూవీలో కావ్య థాపర్ హీరోయిన్ గా నటించగా కీలక పాత్రల్లో అనుపమ పరమేశ్వరన్, నవదీప్, అజయ్ ఘోష్ నటించారు. ఇటీవల థియేటర్స్ లో ఆడియన్స్ ముందుకి వచ్చిన ఈగిల్ మూవీ మంచి విజయం అందుకుంది. కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ గ్రాండ్ లెవెల్లో నిర్మించింది. విషయం ఏమిటంటే, కొద్దిసేపటి క్రితం ఈ మూవీ ప్రముఖ ఓటిటి మాధ్యమాలు అమెజాన్ ప్రైమ్, ఈటివి విన్ ద్వారా ఆడియన్స్ ముందుకి వచ్చింది. మరి థియేటర్స్ లో ఆకట్టుకున్న ఈమూవీ ఓటిటి ఆడియన్స్ ని ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

## హైకోర్టులో జయప్రదకు ఎదురుదెబ్బ



సినీనటి జయప్రదకు అలహాబాద్ హైకోర్టు షాకిచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన కేసులో ఆమెను మార్చి 6లోపు అరెస్ట్ చేయాలని ఉత్తర్ ప్రదేశ్ లోని రాంపూర్ ట్రయల్ కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆమెకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయితే తనపై జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంటును నిలిపివేయాలని కోరుతూ జయప్రద అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాన్ని గురువారం జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ తో కూడిన సింగిల్ బెంచ్ విచారించి.. జయప్రద దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది. ఈ కేసులో కొన్ని కొత్త వాస్తవాలు, పత్రాలతోపాటు కొత్త దరఖాస్తును దాఖలు చేయాలనుకుంటున్నామని.. అలాగే పిటిషన్ ను ఉపసంహరించుకోవడానికి కోర్టు అనుమతించాలని జయప్రద తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు.ఈ అభ్యర్థనను స్వీకరించిన కోర్టు పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతించింది. 2019 లోక్ సభ ఎన్నికల తర్వాత జయప్రదపై రెండు కేసులు నమోదు అయ్యాయి. ఎన్నికల సమయంలో రాంపూర్ లో బీజేపీ తరుపున ప్రచారం చేస్తున్న జయప్రద ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించినవే. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ఆమె రోడ్డును ప్రారంభించడంతో స్వార్ పోలీస్ స్టేషన్లో ఆమెపై కేసు నమోదైంది. ఈ కేసుల్లో రాంపూర్ జిల్లా కోర్టు ఆమెకు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ ఆమె కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఆమెపై ఇటీవలే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది ట్రయల్ కోర్టు. అయినా ఆమె విచారణకు హాజరుకాకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లోని ప్రత్యేక కోర్టు ఆమెను పరారీలో ఉన్నట్లు ప్రకటించింది. అయితే ఈ వారెంటును సవాలు చేస్తూ జయప్రద దాఖలు చేసిన పిటిషన్ ను ధర్మాసనం కొట్టివేసింది. 1974లో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టింది.



## నేటి నుంచి సున్నా కరెంట్ బిల్లులు

నగరంలో సున్నా కరెంట్ బిల్లులకు రంగం సిద్ధమైంది. విద్యుత్తు బిల్లులతో ఆహార భద్రత(రేషన్) కార్డు అనుసంధానమైన వినియోగదారులకు గృహజ్యోతి వర్తించనుంది. 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడకం ఉన్న అందరికీ ఈ నెల సున్నా బిల్లు రానుంది. ఈ మేరకు బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. అందుకోసం కొత్త బిల్లింగ్ యంత్రాలు కొనుగోలు చేశారు. వీటి పనితీరును ఇప్పటికే పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. టెస్టింగ్ కోసం సున్నా బిల్లులు జారీ చేసి చూశారు. అంత సక్రమంగా ఉన్నట్లు ఇంజినీర్లు నిర్ధారించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి 1 శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ అన్ని సెక్షన్లలో ప్రారంభించాలని సీఎండీ ఆదేశించారు. గురువారం అర్ధరాత్రి వరకైనా సరే ఫిబ్రవరి నెల ఖాతాలను ముగించి.. మార్చి వివరాలను బిల్లింగ్ యంత్రాల్లో లోడ్ చేయాలని ఆదేశించారు. నగరంలోని తొమ్మిది సర్కిళ్ల పరిధిలో 48.06 లక్షల గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రజాపాలనలో జీహెచ్ఎంసీ, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కలిపి గృహజ్యోతికి 19.85 లక్షల మంది దరఖాస్తు చేశారు. ప్రభుత్వం ఆహార భద్రత కార్డు ఉన్నవారికే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అని ప్రకటించడంతో.. ఇప్పటివరకు 11 లక్షల మందే ఈ పథకానికి అర్హులుగా తేలారు.

### అర్హత ఉండి సున్నా బిల్లు రాకపోతే..

మున్సిపల్, మండల కార్యాలయాల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆహార భద్రత కార్డు, దీనికి లింక్ చేసిన ఆధార్, గృహ విద్యుత్తు కనెక్షన్ల నంబర్‌ను దరఖాస్తుతోపాటు సమర్పించాలి. వీటిని విద్యుత్తు సిబ్బంది పరిశీలించి అర్హుల జాబితాలో చేరుస్తారు. తర్వాతి నెల నుంచి సున్నా బిల్లు వస్తుంది. అవసరమైతే సవరించిన బిల్లు జారీచేస్తారు. వీరు బిల్లు కట్టలేదని ఎలాంటి బలవంతపు చర్యలు ఉండవని కూడా సర్కారు ప్రకటించింది.

# హాట్ లుక్‌లో నిషా గుర్గావ్

ఇన్‌స్టాగ్రామ్ స్టార్ మరియు మోడల్ నిషా గుర్గావ్ తన గ్లామరస్ లుక్‌ల కోసం సోషల్ మీడియాలో నిరంతరం చర్చలు జరుపుతుంది. నిషా గుర్గావ్ చాలా కూల్ లుక్‌లో ఇన్‌స్టాగ్రామ్‌లో చిత్రాలను పంచుకున్నారు. కొత్త లుక్‌లో నిషా చాలా హాట్ లుక్‌లో పోజులిచ్చింది. నిషా గుర్గావ్ అభిమానులు ఆమె కొత్త లుక్‌తో కూడా ప్రేమలో పడింది.ఫిదా లుక్‌లో పిచ్చిగా మారింది. ఈ చిత్రాలు ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్నాయి.







## మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తే
# వంటగ్యాస్ రూ.2 వేలకు పెరగొచ్చు



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం మళ్లీ గెలిచి కేంద్రంలో అధికారం చేపడితే.. వంట గ్యాస్ సిలిండర్ల ధర అమాంతం పెరిగిపోతుందని హెచ్చరించారు. సిలిండర్ ధర రూ.2వేల వరకు పెరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని వ్యాఖ్యానించారు. దేశంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైన విషయం తెలిసిందే. కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో వరుసగా రెండు సార్లు అధికారం చేపట్టిన బీజేపీ.. ఇప్పుడు హ్యాట్రిక్ విజయంపై కన్నేసింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాలని ఉవ్విళ్లూరుతోంది. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వస్తామని ప్రధాని మోదీ కూడా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీఏ కూటమి 400 సీట్లకు పైగానే గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ హ్యాట్రిక్‌పై మమతా బెనర్జీ స్పందించారు. ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. జర్‌గ్రామ్ జిల్లాలో నిర్వహించిన ఒక పబ్లిక్ ఈవెంట్‌లో దీదీ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే.. వాళ్లు వంట గ్యాస్ సిలిండర్ ధరలను రూ. 1,500 లేదా రూ. 2,000కి పెంచవచ్చని వ్యాఖ్యానించారు. 'రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే.. వాళ్లు వంట గ్యాస్ సిలిండర్ ధరలను రూ. 1,500 లేదా రూ. 2,000కి పెంచవచ్చు. అప్పుడు మనం మంటలను వెలిగించేందుకు కలపను సేకరించే పాత పద్ధతికే తిరిగి వెళ్లాల్సి ఉంటుంది' అంటూ వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో.. ఆవాస్ యోజన కింద చేపట్టిన హౌసింగ్ ప్రాజెక్టుల విషయంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి మమతా బెనర్జీ ఓ అల్టిమేటం జారీ చేశారు. ఏప్రిల్ నెలాఖరులోగా ఈ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. అలా చేయలేకపోతే.. మే నెలలో తమ రాష్ట్ర ప్రభుత్వమే ఆ బాధ్యత తీసుకుంటుందని హెచ్చరించారు.

## గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు డైరెక్టర్ క్రిష్



హైదరాబాద్ రాడిసన్ పబ్‌లో డ్రగ్స్ పార్టీ కేసులో పోలీసుల విచారణ వేగవంతగా సాగుతుంది. ఈ కేసులో ఏ10 నిందితుడిగా డైరెక్టర్ క్రిష్ పేరును చేర్చారు పోలీసులు. ఇందులో భాగంగా ఈరోజు (మార్చి 1న) విచారణకు హాజరుకానున్నారు క్రిష్. తాను ముంబైలో ఉన్న కారణంగా విచారణకు హాజరు కాలేకపోతున్నానని శుక్రవారం రోజు వస్తానని పోలీసులకు విజ్ఞప్తి చేశారు క్రిష్. ఈరోజు గచ్చిబౌలీ పోలీసుల ముందుకు రానున్నారు. ఈ క్రమంలోనే ఆయన డ్రగ్స్ తీసుకున్నారా ? లేదా? అనేది విచారణలో తేల్చనున్నారు. అలాగే అతడికి వైద్య పరీక్షలు నిర్వహించాలని పోలీసులు భావిస్తున్నట్లుగా సమాచారం. ఇప్పటికే క్రిష్ ను విచారణకు హాజరు కావలసిందిగా స్పష్టం చేశారు గచ్చిబౌలీ పోలీసులు. రాడిసన్ డ్రగ్స్ కేసు రోజు రోజుకీ అనుహ్యా మలుపులు తిరుగుతుంది. ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్న డ్రగ్స్ సప్లైయర్ అబ్బాస్ విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. మీర్జా వహీద్ అనే వ్యక్తి దగ్గర కొకైన్ కొనుగోలు చేసి దానిని గజ్జల వివేకానంద్ డ్రైవర్ గద్దల ప్రవీణ్ కు అప్పగిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఈ కేసులో మరో ఇద్దరిని నిందితులుగా చేర్చారు పోలీసులు. ఏ11గా వివేకానంద్ డ్రైవర్ గజ్జల ప్రవీణ్.. ఏ12గా మీర్జా వహీద్ పేరును చేర్చారు పోలీసులు. గతేడాది గజ్జల వివేకానంద డ్రగ్స్ కి బానిస అయినట్లుగా అబ్బాస్ విచారణలో బయటపెట్టినట్లు తెలుస్తోంది. అలాగే రాడిసన్ హోటల్లో వివేక్ తన స్నేహితులు క్రిష్, నిర్భయ్ సింధీతో పార్టీ జరుపుకున్నట్లు వెల్లడించాడు. మరోవైపు తన చెల్లెలు లిషీ కనిపించడం లేదంటూ హీరోయిన్ కుషిత గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. డ్రగ్స్ కేసు తెరపైకి వచ్చినప్పటి నుంచి తన చెల్లెలు ఇంటికి రావడం లేదని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ఆమె ఎట్టి పరిస్థితుల్లోనూ విచారణకు హాజరుకావాలని ఆమె కుటుంబసభ్యులకు సూచించారు పోలీసులు. అలాగే డైరెక్టర్ క్రిష్, చరణ్, సందీప్, లిషీ, శ్వేత, నీల్ ఇళ్లకు 160 సీఆర్పీసీ నోటీసులు పంపించారు పోలీసులు. ఈ క్రమంలోనే బెంగళూరులో ఉన్న రఘు చరణ్ అట్లూరి గురువారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో విచారణకు హజరయ్యారు.



### బంగ్లాదేశ్‌లో ఘోర అగ్నిప్రమాదం..
## 44 మంది మృతి

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏడు అంతస్తుల రెస్టారంట్‌లో మంటలు చెలరేగి కనీసం 44 మంది మృతి చెందారు. మరో 40 మందికి పైగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది 75 మందిని రక్షించారు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లనే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఢాకా బెయిలీ రోడ్డులోని ఓ బిర్యానీ రెస్టారంట్‌లో గురువారం రాత్రి మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక విభాగం అధికారి మహమ్మద్ షిహబ్ వెల్లడించారు. క్రమంగా పై అంతస్తులకు విస్తరించినట్లు తెలిపారు. రెండు గంటల్లో మంటలను అదుపులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో రెస్టారంట్లు, వస్త్ర దుకాణాలు, మొబైల్ ఫోన్ల విక్రయ కేంద్రాలు అధికంగా ఉన్నాయి. "మేం ఆరో అంతస్తులో ఉన్నాం. మెట్ల మార్గంలో పొగ వస్తుండడం గమనించాం. అందరూ కింది నుంచి పైకి పరుగెత్తుకొచ్చారు. మేమంతా నీటి పైపుల ద్వారా కిందకు దిగాం. కొందరు పై నుంచి దూకటంతో తీవ్ర గాయాలయ్యాయి. కొంత మంది పూర్తిగా భవనం పైకి చేరుకున్నారు. సాయం కోసం అర్థించారు" అని రెస్టారంట్ మేనేజర్ సోహెల్ తెలిపారు. బంగ్లాదేశ్‌లో అపార్ట్‌మెంట్లు, ఫ్యాక్టరీ కాంప్లెక్సుల్లో అగ్ని ప్రమాదాలు తరచూ జరుగుతుంటాయి. 2021 జులైలో ఓ ఆహార శుద్ధి పరిశ్రమలో చెలరేగిన మంటల్లో అనేక మంది పిల్లలు సహా 52 మంది దుర్మరణం చెందారు. 2019 ఫిబ్రవరిలో రాజధాని ఢాకాలో అపార్ట్‌మెంట్ బ్లాకుల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో 70 మంది మృతి చెందారు.




### పేటీఎం సంక్షోభం..
## పీపీబీఎల్‌తో ఒప్పందాల రద్దు

నియంత్రణాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ అనుబంధ సంస్థ పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌తో అంతర్గతంగా ఉన్న ఒప్పందాలన్నింటినీ ఉపసంహరించుకుంటున్నట్లు ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య పరస్పర అంగీకారం కుదిరినట్లు శుక్రవారం తెలిపింది. అయితే, ఆ ఒప్పందాలు ఏంటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. పీపీబీఎల్ స్వతంత్రంగా తన కార్యకలాపాలు నిర్వహించుకునే సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తమ కస్టమర్లు, వ్యాపారులకు నిరంతరాయ సేవలను కొనసాగించడం కోసం ఇతర బ్యాంకులతో భాగస్వామ్యం కుదుర్చుకోనున్నట్లు పేటీఎం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. తద్వారా పేటీఎం యాప్, క్యూఆర్, సౌండ్‌బాక్స్, కార్డు మెషీన్లు యథావిధిగా పనిచేస్తాయని తెలిపింది. పీపీబీఎల్ పార్ట్‌టైమ్ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ హోదా నుంచి విజయ్ శేఖర్ శర్మ వైదొలగిన కొన్ని రోజుల్లోనే తాజా పరిణామం చోటుచేసుకుంది. పీపీబీఎల్‌లో ఆయనకు 51 శాతం వాటాలున్నాయి. మిగతావి వన్97 కమ్యూనికేషన్స్ చేతిలో ఉన్నాయి. జనవరి 31న పీపీబీఎల్‌పై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో 2024 మార్చి 15 తర్వాత డిపాజిట్లను స్వీకరించొద్దు. వినియోగదారుల ఖాతాలు, ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, వాలెట్‌లు, ఫాస్ట్‌ట్యాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ (ఎన్‌సీఎంసీ) కార్డులు తదితరాల్లో క్రెడిట్ లావాదేవీలు లేదా టాప్‌అప్‌లు చేయొద్దు. ఈ నేపథ్యంలో గతకొన్ని రోజులుగా కంపెనీ షేరు విలువ పతనమవుతూ వస్తోంది.

### టెక్సాస్ పాన్‌హ్యాండిల్ కార్చిచ్చుకు
## 10 లక్షల ఎకరాలు భస్మం..!

అమెరికాలోని టెక్సాస్ పాన్‌హ్యాండిల్ వద్ద కార్చిచ్చులు అత్యంత తీవ్ర రూపం దాల్చాయి. వీటిల్లో అతి పెద్దదైన ది స్మోక్ హౌస్ క్రీక్ కారణంగా ఇప్పటి వరకు దాదాపు 10 లక్షల ఎకరాల్లో ఉన్న చెట్లు, పొలాలు, గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. వీటి తీవ్రతను నమోదు చేయడం మొదలుపెట్టిన 1980 నుంచి ఆ రాష్ట్ర చరిత్రలో ఇదే అతిపెద్ద కార్చిచ్చు. శుక్రవారం కూడా పొడి వాతావరణం కొనసాగనుండటంతో ఇది ఆగే పరిస్థితి లేదు. ఈ అగ్నికీలలు ఉపగ్రహ చిత్రాల్లో స్పష్టంగా కనిపించడం గమనార్హం. గురువారం సాయంత్రం నాటికి పొరుగు రాష్ట్రమైన ఓక్లహోమాలో కూడా మరో 31,500 ఎకరాలను ఇది కాల్చేసింది. అక్కడ కూడా అత్యవసర పరిస్థితి విధించారు.టెక్సాస్ చుట్టుపక్కల వ్యాపించిన మొత్తం కార్చిచ్చులు కలిపి 2,000 చదరపు కిలోమీటర్ల మేర భస్మం చేశాయి. అమెరికాలోని డెలావేర్ రాష్ట్రం విస్తీర్ణానికి ఇది సమానం. ఇప్పటి వరకు స్మోక్ హౌస్ క్రీక్ కార్చిచ్చుకు ఇద్దరు వ్యక్తులు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. మంటలు వ్యాపించిన ప్రాంతంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయినట్లు నార్త్ పవర్ ఎలక్ట్రిక్ కో-ఆపరేటివ్ సంస్థ ప్రకటించింది. దాదాపు 115 మైళ్లలో ఉన్న విద్యుత్తు తీగలను పునరుద్ధరించాలని తెలిపింది. హెంప్‌హిల్ ప్రాంతంలో భారీగా గృహాలు దహనమయ్యాయి.






### ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు
## ముగ్గురు మృతి..
### గుంటూరు జిల్లాలో ఘటన

గుంటూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్‌ను కారు ఢీ కొట్టడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన గుంటూరు జిల్లా ఏటుకూరు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కంకర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓ కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ముగ్గురిని గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రత్తిపాడు సీఐ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతులు మంగళగిరి వాసులుగా గుర్తించారు.